# ఆల్ ఇన్ వన్

తిరుమలశ్రీ

"హాయ్, మిస్టర్ వెంకట్!" అన్న పిలుపుతో అటు చూసాడు వెంకట్రావ్

మిస్ మార్గరెట్, ఫిలిప్స్ డిపార్ట్‌మెంటల్ స్టోర్ ఎదుట కనిపించారు

హాయ్! అంటూ మార్గరెట్‌ని గ్రీట్ చేసాడు అతను 'హౌ డూ యూ డూ?'

"ఫైన్, థాంక్యూ!" అందామె

"హలో!' అన్నాడు ఫిలిప్స్ చేయి చాపుతూ

'హలో!' అంటూ అతనికి షేక్ హ్యాండిచ్చాడు వెంకట్రావు

మిస్ మార్గరెట్, వెంకట్రావ్‌కి క్లాస్‌మేట్, కొల్లీగూను ఇరవయ్యేళ్ళుంటాయి ఆ అమ్మాయికి తెల్లగా, పాలరాతి బొమ్మలా వుంటుంది

ఫిలిప్స్ ఆమె బాయ్‌ఫ్రెండ్ ఇంచు మించు ఆమె వయసే వుంటుంది అతనికి. ఏదో కంపెనీలో సేల్స్‌మాన్‌గా పని చేస్తున్నాడు తరచు ఆమెకోసం యూనివర్శిటీకి వస్తుంటాడు అందువల్లే అతనితో కూడా పరిచయమయింది వెంకట్రావుకి వెంకట్రావుతో చాలా స్నేహంగా, కలుపుగోలుగా వుంటాడతను ఒకరి అపార్ట్‌మెంట్‌కి ఒకరు అప్పుడప్పుడు వెళ్ళి వస్తుంటారు

త్వరలో నే మార్గరెట్, ఫిలిప్స్‌లు వివాహం చేసుకోబోతున్నట్లు వెంకట్రావుకు తెలుసు

వాట్స్ ద మాటర్ మాన్ ఆర్ యూ లాయిటరింగ్ వాయర్? అన్నాడు ఫిలిప్స్, వెంకట్రావుతో చనువుగా

పర్‌హాప్స్ సెర్చింగ్ ఫర్ గాళ్ ఫ్రెండ్' అని నవ్వింది మార్గరెట్

వెంకట్రావు కూడా నవ్వాడు

గదిలో ఏం తోచక వాకింగ్‌కి బయలుదేరాను' అన్నాడు

ఆ రోజు ఆదివారం యూనివర్శిటీకి సెలవు

మీరెక్కడికి బయలుదేరారు? ఫిల్మ్‌కా? అని ప్రశ్నించాడు వారిని

కాదు వచ్చేవారం మా మారేజ్ కదూ? సంసారానికి కావలసిన వస్తువుల్ని కొనుక్కోవడానికి బయలుదేరాము' అంది మార్గరెట్

నీకేం పని లేదంటున్నావుగా నువ్వూ రాకూడదూ, ముగ్గురం కలిసి సెలెక్ట్ చెయ్యొచ్చు? అన్నాడు ఫిలిప్స్

"అయాం పూర్ ఇన్ సెలెక్షన్ అయినా, కాబోయే దంపతుల మధ్య నేనెందుకూ పానకంలో పుడకలా?" అన్నాడు వెంకట్రావు నవ్వుతూ.

మార్గరెట్ ఫక్కుమంది

"యూ ఆర్ సెన్సిబుల్ బాయ్" అంటూ అతని చెంపమీద మృదువుగా ఓ చిన్న దెబ్బ వేసింది

ముగ్గురూ హాయిగా నవ్వుకున్నారు

'ఆల్‌రైట్ సాయంత్రం నా అపార్ట్‌మెంట్‌కి రావాలి నువ్వు– మా సెలెక్షన్ ఎలా వున్నదో చెప్పడానికి ఓ కే?' అన్నాడు ఫిలిప్స్ చేయి చాపుతూ

"ఓ కే" అంటూ షేక్‌హ్యాండిచ్చాడు వెంకట్రావ్

"బై–" అంది మార్గరెట్ చేయి వూపుతూ

ఆమెకు 'బై' చెప్పి ముందుకు సాగాడు వెంకట్రావ్

మార్గరెట్, ఫిలిప్స్‌లను చూస్తే ముచ్చటగా వుంటుంది అతనికి

ఆమె అందానికి తగినట్టే హ్యాండ్‌సమ్‌గా వుంటాడు ఫిలిప్స్ మేడ్ ఫర్ ఈచ్ అదర్' పేర్లా వుంటారు వాళ్ళు

పైగా ఫిలిప్స్ హృదయ వైశాల్యతను తలచుకుంటే ఆశ్చర్యం వేస్తుంటుంది వెంకట్రావ్‌కి ఎన్నోసార్లు అతని ఎదుటనే వెంకట్రావుతో అతి చనువును ప్రదర్శించేది మార్గరెట్ ఫిలిప్స్ నవ్వుతూ చూస్తాడేగాని, అతని ముఖంలో ఎన్నడూ ఆగ్రహం గాని, అసూయగాని సూచనప్రాయంగానైనా కనిపించేవే కావు వెంకట్రావుకు

అమెరికన్ పర్మిసివ్ సొసైటీలో ఆడపిల్లలూ, మగపిల్లలూ ఫ్రీగా తిరుగుతూంటే ఆశ్చర్యంగా అబ్జర్వ్ చేసేవాడు వెంకట్రావు మొదట్లో తన క్లాస్‌మేట్స్, కొల్లీగ్స్ అయిన ఆడపిల్లలు తనను తాకుతూ చనువుగా ప్రవర్తిస్తుంటే ఏదోలా వుండేది

తన మరదలు దుర్గ గుర్తుకొస్తుండేది

తరువాత్తరువాత వారి చనువు వెనుకనున్న స్నేహశీలత, స్వేచ్ఛా ప్రకృతి, సహకార ధోరణి గుర్తించేసరికి ఆనందం కలిగింది అతనికి

ఇండియాలో అన్నా, చెల్లెలూ కలిసి తిరిగినా– వాళ్ళెవరో తెలుసుకోకుండానే బుగ్గలు నొక్కుకునే, చెవులు కొరుక్కునే పద్ధతి అక్కడ లేనందువల్ల, అమ్మాయిలతో ఫ్రీగా మూవ్ అవడంలో అంతగా ఇబ్బంది అనిపించేది కాదు

వెంకట్రావు అమెరికా వచ్చి ఏడాది అయింది

ఆటోమొబైల్ ఇంజినీరింగ్‌లో పి హెచ్ డి చేసే నిమిత్తం అయిదేళ్ల ప్రోగ్రాం మీద అక్కడికి వచ్చాడతను

అసలు వెంకట్రావుది గోదావరి జిల్లాలోని ఓ కుగ్రామం

భూస్వామి అయిన తండ్రి, తనను పెళ్ళాడడానికి కాచుకునివున్న ఓ మేన కోడలూ వున్నారు అతనికి ఆ గ్రామంలో

తనకు చదువు లేకపోయినా కొడుకు నైనా పెద్ద చదువులు చదివించాలనీ, గొప్ప ఇంజనీర్‌ని చేయాలనీ పట్టుదలతో వెంకట్రావుని ఎమ్ టెక్ వరకు చదివించాడు తండ్రి ఆ తరువాత అమెరికాలో స్కాలర్‌షిప్ సంపాదించి డాక్టరేట్ కోసమని వెళ్ళాడు వెంకట్రావు కేవలం స్కాలర్‌షిప్‌తో అమెరికాలో జీవించడం కష్టం కనుక, పార్ట్ టైమ్ లెక్చరర్ జాబ్‌ని కూడా యూనివర్శిటీయే ఏర్పాటు చేసింది అతనికి

కొడుకు అమెరికా బయలుదేరుతొంటే పెళ్ళి చేసుకుని దుర్గను కూడా తీసుకు పొమ్మన్నాడు తండ్రి కొన్నాళ్లపాటు అక్కడి స్థితిగతులు చూసాక చేసుకుంటానని చెప్పి వచ్చేసాడు వెంకట్రావు మేనగోడలు దుర్గ నుంచి నెలకో పుత్తరమైనా వస్తూనే వుంటుంది అతనికి.

అప్పుడప్పుడు ఇంటి మీదకు ధ్యాస మళ్ళినా దుర్గ, తండ్రి రాసే పుత్తరాల వల్ల నైతేనేమి, మార్గరెట్, ఫిలిప్స్ వంటి మంచి మిత్రుల సాంగత్యంతో నైతేనేమి, స్టడీస్‌తో బిజీగా వుండడం వల్ల నైతేనేమి ఇంటిని కొంతవరకు మరిచి పోగలుగు తున్నాడు అతను

* * * * *

ఆ సాయంత్రం అనుకున్న ప్రకారం ఫిలిప్స్ అపార్ట్‌మెంట్‌కి వెళ్ళాడు వెంకట్రావు

మార్గరెట్ కూడా అక్కడే వున్నది

ఇద్దరూ పేకాడుకుంటున్నారు.

వెంకట్రావును సాదరంగా ఆహ్వానించారు ఆ కాబోయే దంపతులు

గదిలోని సామానంతా చూసి విస్తుపోయాడు వెంకట్రావు

'ఇదంతా ఇవాళ కొనుక్కొచ్చిందేనా?' అని ప్రశ్నించాడు ఆశ్చర్యంగా

"ఔను, ఏం?" అన్నాడు ఫిలిప్స్

మార్గరెట్ తయారు చేసిన చాక్లెట్ టీని సిప్ చేస్తూ ఒక్కో వస్తువునే పరీక్షగా చూడ సాగాడు వెంకట్రావు

ఎలిక్ట్రికల్ మిక్సర్, గ్రైండర్ కుకింగ్ రేంజ్ డిష్ క్లీనింగ్ మెషీన్ వాషింగ్ మెషీన్ ఐరనింగ్ మెషీన్. ఫ్లోర్ క్లీనింగ్ మెషీన్ డస్టింగ్ మెషీన్ పాలిషింగ్ మెషీన్

ఇలా ఎన్నో ఎన్నెన్నో !

అన్నీ ఎలిక్ట్రికల్ ఎలక్ట్రానిక్ యంత్రాలే! అమెరికాలో జీవనం యంత్రాల మీదే

నడుస్తుందని వెంకట్రావు అక్కడికి రాకముందు ఆలకించడమే కాక, కొన్ని యంత్రాలను అక్కడికి వచ్చాక కొందరు స్నేహితులు ఇళ్లలో చూసాడు కూడాను కాని, పెళ్లవుతుందనగానే ముందే అన్ని రకాల మెషీన్లు ఒకే సారి కొని వుంచడాన్ని మొదటి సారిగా అదే చూడడం.

వాటన్నిటికీ ఎన్ని వేల డాలర్లు అయ్యాయో ఆలకించేసరికి గుండె ఆగినంత పనయింది అతనికి

ఖర్చంతా ,ఎవరిది?' అని ప్రశ్నించాడు కుతూహలంతో

"నాదే' అన్నాడు ఫిలిప్స్ సగర్వంగా

"నీ సేవింగ్స్ అన్నీ ఈ దెబ్బతో షేవ్ అయిపోయి వుండాలే!" అన్నాడు వెంకట్రావు

"ఓ, దీసీజ్ నతింగ్ అంటూ తేలికగా నవ్వేడు ఫిలిప్స్

అవసరమైతే ఖర్చు ఇద్దరమూ భరించడానికి మేము సిద్ధమే' అంది మార్గరెట్

"పెళ్ళికి ముందు ఇవన్నీ అవసరమా?" అన్న వెంకట్రావు ప్రశ్నకు, అమాయకుణ్ణి చూసినట్లు చూసింది మార్గరెట్

"లేకుంటే ఆ పనులన్నీ ఎవరు చేస్తారనుకున్నావ్?' అంటూ నవ్విందామె

ఐసీ" అన్నాడు వెంకట్రావు ఏదో తెలిసినట్లు ఒక వేళ రాబోయే 'భర్త దగ్గర ఇవన్నీ కొనడానికి చాలినంత డబ్బు లేకపోతేనో?" తన సందేహాన్ని బయటపెట్టాడు

"ఓ, సిల్లీ! తగినంత సొమ్ము సంపాదిస్తే గాని తొందరపడి పెళ్లి చేసుకోము మేము" అన్నాడు ఫిలిప్స్

"ఒకరిపైన మరొకరు ఆర్థికంగా ఆధారపడడం మాకు ఇష్టం వుండదు' అంది మార్గరెట్

వాళ్లను చూసి మనవాళ్లు నేర్చుకోవలసింది ఎంతైనా వుంది అనుకున్నాడు వెంకట్రావు

'నీ ప్రశ్నలు చూస్తుంటే నాకు సందేహం కలుగుతోంది మీ దేశంలో ఈ మెషీన్లు కొనరా? అయితే ఈ పనులన్నీ ఎవరు చేస్తారు?" అంటూ ప్రశ్నించింది మార్గరెట్

ఆమెను తమాషా చేయాలని పించింది వెంకట్రావుకు

"మా దేశంలో అపనులన్నిటికీ వేర్వేరు మెషీన్లు కొననవసరం లేదు. ఒకే మెషీన్ చేస్తుంది" అన్నాడు

ఆశ్చర్యంతో, నమ్మలేనట్టుగా ముఖాలు చూసుకున్నారు ఫిలిప్స్, మార్గరెట్‌లు.

"యూ ఆర్ జోకింగ్!' అన్నాడు ఫిలిప్స్

"ఐనో అబౌట్ ఇండియా"

"అయాం నాట్ జోకింగ్... అన్ని పనులకూ ఒకే యంత్రాన్ని వుపయోగిస్తాం మేము" అన్నాడు వెంకట్రావు దృఢంగా

"హౌ ఈజిట్ పాసిబుల్ మాన్?" అంది మార్గరెట్ అయోమయంగా చూస్తూ.

"అటువంటి యంత్ర మొకటి ప్రపంచంలో ఎక్కడా వున్నట్లు ఇంతవరకూ వినలేదు నేను" అన్నాడు ఫిలిప్స్.

"ఇప్పుడు వింటున్నావు గదా!" అన్నాడు వెంకట్రావు మందహాసంతో.

"యూ .. యూ రియల్లీ మీనిట్?!" నమ్మలేక పోతోంది మార్గరెట్.

"ఎస్ ఆయంత్రం పాడుతుంది, ఆడుతుంది కూడాను. మనం ఏం చెబితే అది చేస్తుంది "

"ఓ! ఇటీజ్ ఆల్ ఇన్ వన్!?" అంది మార్గరెట్.

"ఏదో స్ఫురించినట్లు , "ఓ, ఐనో గాటిట్ .. రబాట్ అయివుంటుందది" అన్నాడు ఫిలిప్స్.

"యూ ఆర్ రైట్ బట్, మనం ఇంతవరకు ఎరిగిన రబాట్స్ వంటిది కాదది దానికి ఆజ్ఞలు జారీ చేయడానికి కంప్యూటర్ అవసరం లేదు హ్యూమన్ బ్రెయిన్ చాలు!" అన్నాడు వెంకట్రావ్

"ఓహ్! ఇటీజ్ రియల్లీ మార్వలెస్!" అంది మార్గరెట్

"దాని వెల ఎంత వుంటుంది?" అడిగాడు ఫిలిప్స్

"ఇటీజ్ అబ్సల్యూట్ లీ ఫ్రీ"

"వాట్!?" అంది మార్గరెట్

'యూ ఆర్ జస్ట్ ఫూలింగ్ అజ్" అన్నాడు ఫిలిప్స్

"ఏం కాదు. ఐ మీన్ – మా దేశంలో లాగ వరుడు తన సొంత డబ్బు తగలేసి ఆ యంత్రాన్ని కొన వలసిన పనిలేదు.. "

"దెన్ –?!'

–ఫిలిప్స్, మార్గరెట్‌లు ఇద్దరూ ఒకేసారి అరిచారు

"పెళ్లి సందర్భంలో మావగారు వరుడికి కానుకగా ఇస్తాడు దాన్ని" అన్నాడు వెంకట్రావు


"బట్, ఇటీజ్ సింప్లీ అన్ బిలీవబుల్ !" అన్నారు ఇద్దరూ

"ఇందులో నమ్మరాని దేమీలేదు నెక్స్ట్ మంత్ నేను సెలవులో మా దేశానికి వెళుతున్నాను కదా? తిరిగి వచ్చేప్పుడు ఆ యంత్రాన్ని తీసుకొస్తాను, చూద్దురు గాని" అని వెంకట్రావు అనడంతో –

"వండర్‌ఫుల్! " అన్నారు వాళ్లిద్దరూ సంతోషంతో.

పసిపిల్లల్లా కేరింతలు కొడుతున్న వారిద్దరినీ






చూసి నవ్వుకున్నారు వెంకట్రావు

* * * * *

ఓ నెల్నాళ్ళు సెలవు తీసుకుని భారత దేశానికి వచ్చాడు వెంకట్రావు

ఈసారి తిరిగి వెళ్ళేప్పుడు దుర్గను కూడా తీసుకు వెళ్ళ వలసిందేనని పట్టుబట్టింది అక్కగారు ఆలస్యం చేస్తే తమ్ముడు అమెరికాలో ఏ దొరసాని పిల్లను చేసేసు కుంటాడో నన్నది ఆమె భయం

తండ్రి కూడా ప్రతి ఉత్తరంలోనూ తన పెళ్ళి విషయం ప్రస్తావిస్తూనే వున్నాడు– అక్కయ్య తొందర పడుతోంది దుర్గ పెళ్ళి గురించి అని ఎప్పటికప్పుడు పెళ్ళి వాయిదా వేస్తూనే వస్తున్నాడు వెంకట్రావు. ఈసారి వొత్తిడి చూస్తే తప్పించుకోవడం కష్టమనిపించింది పైగా, తనకూ దుర్గతో పాటు ఫారిన్ లైఫ్ ఎంజాయ్ చేయాలనే వుంది

ఫలితంగా హడావిడిగా ముహూర్తాలు పెట్టుకోవడ మేమిటి, పెళ్ళి అయిపోవడ మేమిటి – అన్నీ నెల్నాళ్ళలో పూర్తయి పోయాయి

భార్య దుర్గను తీసుకుని అమెరికాకు తిరుగు ప్రయాణం అయ్యాడు వెంకట్రావు

* * * * *

వెంకట్రావు చెప్పా పెట్టకుండా పెళ్ళి చేసుకుని భార్యతో తిరిగి వచ్చాడని తెలియగానే గిఫ్ట్స్ పట్టుకుని అతని అపార్ట్ మెంట్‌కి వెళ్ళారు ఫిలిప్స్, మార్గరెట్‌లు

దుర్గకు ఆ మనుషులు, వారి ప్రవర్తన, అక్కడి వాతావరణము అంతా కొత్తగా, వింతగా వున్నా– ఫిలిప్స్ దంపతుల స్నేహ శీలతకు, కలుపు గోరు తనానికీ ముగ్ధురాలయింది. కొద్ది సేపట్లోనే వారితో కలిసి పోయింది ఆమె ఎటువంటి రిజర్వేషన్సూ లేకుండా

టీ త్రాగుతూ ఇల్లంతా కలయ జూసారు

# ఆల్ ఇన్ వన్

మార్గరెట్, ఫిలిప్స్‌లు.

"వాళ్ళు అలా ఎందుకు చూస్తున్నారో బోధపడలేదు దుర్గకు

కాని, వెంకట్రావుకు అర్థమయి పోయింది

"వెంకట్! రబాట్‌ని తీసుకు రాలేదా? అని ప్రశ్నించాడు ఫిలిప్స్ చివరకు ఆతృతను అణచుకోలేక

'తెచ్చాను' అన్నాడు వెంకట్రావు

"వేరీజిట్?' అంది మార్గరెట్ కుతూహలంతో ఎగిరి గంతేసి

మీ ఎదురుగానే వుంది, చూళ్ళేదా?" అన్నాడు వెంకట్రావు నవ్వుతూ

తెల్లబోయారు ఇద్దరూ

"ఎక్కడా?" అన్నారు

"అదిగో!"

దుర్గను చూపించాడు అతను

అయోమయంగా చూసారు ఆదంపతులు.

"వియార్ అస్కింగ్ అబౌట్ ద ఆల్ ఇన్ వన్ రబాట్, మాన్!" అన్నాడు ఫిలిప్స్.

"మా ఆల్ ఇన్ వన్ రబాట్ డిఫరెంట్‌గా వుంటుందని చెప్పానుగా? అదే హ్యూమన్ రబాట్... దటిజ్–మై వైఫ్!"

నిశ్శబ్దంగా ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు ఆ దంపతులు

విషయం అర్థం కాక ఆ ముగ్గురి వంకా చూస్తోంది దుర్గ!

ఆ దంపతుల అవస్థను గమనించిన వెంకట్రావు నవ్వాడు

'ఫిలిప్స్! ఈమె నా భార్య అంటే పెళ్ళిలో నా మావగారు నాకిచ్చిన గిఫ్ట్! ఈమె నాకు శారీరక సుఖాన్ని ఇవ్వడమే కాదు– ఇంట్లో పనంతా ఒక్కతే చేస్తుంది నాకు వండి పెడుతుంది తిన్న గిన్నెలన్నీ కడుగుతుంది ఇల్లంతా క్లీన్ చేస్తుంది అందంగా అలంకరిస్తుంది బట్టలు వుతుకుతుంది ఇస్త్రీ చేస్తుంది. ఆడుతుంది పాడుతుంది నాకోసం పిల్లల్ని కూడా కంటుంది నేను ఏది చెబితే అది చేస్తుంది... షీ ఈజ్ మెషీన్! ఎ హ్యూమన్ రబాట్!" చెప్పుకు పోయాడు అతను

"ఈ యంత్రాన్ని మెయింటెయిన్ చేయడం కూడా చాలా సులభం చాలీ చాలని తిండీ, ఒళ్ళు కప్పుకోవడానికి ఓ గుడ్డా ఇచ్చినా చాలు! జీవితాంతం మగవాడికి సేవచేస్తూ కృతజ్ఞతతో పడివుంటుంది ఊపిరి వున్నంత వరకు దానికి రిటైర్‌మెంట్ అన్నది వుండదు ఇలా అన్నీ అమర్చి పెట్టే భార్య అనే యంత్రం వుండగా– ఇంటి పనులూ, వంట పనులూ చేసేందుకు బోలెడు డబ్బు తగలేసి మెషీన్లు కొనవలసిన అగత్యం ఏముంది మాకు? అందుకే మా దేశంలో అటువంటి సాధనాలు కనిపెట్టం మేము ఒక వేళ ఎవరైనా కనిపెట్టినా వాటి అవసరం మాకు వుండదు పైగా, భార్య అనే ఈ హ్యూమన్ మెషీన్‌ని జీవితాంతం భరించి నందుకు 'కట్నం' అన్న పేరుతో వేలూ, లక్షలూ ఎదురు డబ్బు కూడా ముడుతూ వుంటుంది మాకు .'

ఆశ్చర్యంతో – బహుశా 'షాక్'తో– నోళ్ళు తెరుచుకుని అలకిస్తూ వుండిపోయారు ఆ అమెరికన్ దంపతులు

వారి చూపులు దుర్గ మీద పడ్డాయి

ఆ చూపులలో భారత దేశంలోని వ్యవస్థ పట్ల వెగటు, స్త్రీ పట్ల ఎనలేని జాలి, సానుభూతి ఇమిడి వున్నాయి. □